యతిప్రాసమహాసభ

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి
(శ్రీనవ్యసాహిత్యమండలి నియంత)

క

తెల్లవారి చూసేసరికి సారంగధరుడి మెట్టమీద ఒక పెద్ద తాటాకుపందిరి. దాని పైనీ - కిందా-మామిడాకు తోరణాలు, రంగురంగుల జెండాలు, ఎరుపు, పచ్చ,నీలం కాగితాలగొలుసులూ, బుట్టలూ శీతగాలికి ఊగుతూ కన్నులపండువుగా కనిపిస్తున్నవి. ఆ పందిరికి చుట్టూ చిన్నచిన్న కొత్త తాటాకుపాకలు అందంగా బారులు తీర్చి వీధులువీధులుగా ఉన్నాయి.

ఉదయం ౭ గంటలయింది. బాలసూర్యుని బంగారుకాంతిలో రైలురోడ్డు మొదలుకొని మెట్టదాకా 'దయచేయుఁడు. దయచేయుఁడు' అన్న ఆహ్వానపు టట్టలకు అంతు లేదు. వీరభద్రపురంనుంచి వీరేశలింగంతోటకు ఏదోపనిమీద పోతూన్న నన్ను చూసి మిత్రులు సూర్యనారాయణశాస్త్రిగారూ,సీతాపతిగారూ తొందరగా వెడుతూ "శాస్త్రీ, చప్పున రావాలి. గొప్ప తమాషా జరిగిపోతోంది. పరుగులమీద పోవాలి ర"మ్మన్నారు. 'ఊఁ. ఏదో రాగిశాసనమో, మరణశాసనమో దొరికింది కాబోలు' అని నవ్వుతూ "ఆగండి. ఏమి టాతొందర?" అన్నాను. "కవిత్వం చేసి చంపక రద్దూ! వస్తేగాని చెప్పం" అన్నారు. 'పదండి' అని బయలుదేరాను.

చ

సీతాపతిగారు ముందు నడుస్తున్నారు. ఎట్టకేలకు మెట్ట సమీపించాం. పెద్దతాటాకుపందిరి ఏదో సభాభవనంలాగా కనిపిస్తోంది. "కొంపదీసి ఆంధ్రసాహిత్యపరిషత్తు అభినవకవులకు జడిసి ఇక్కడ జరగడం లేదు గదా" అన్నా సూర్యనారాయణశాస్త్రిగారితో. "అంతకన్న ఒక మహాసంస్థ ఒహటిక్కడ లేవదీశారయ్యా మహానుభావా" అని తీర్చిన 'ఆర్చి' ఒకటి చూపించారు. దానిమీద "అఖిలాంధ్రయతిప్రాసమహాజనసభ" అనే కాకిబంగారంఅక్షరాలు జిగజిగమన్నాయి ఒక్కసారి. సీతాపతిగారు మాతో రహస్యంగా "ఇక్కడ మన మెవరమో ఎవ్వరికీ తెలియగూడదు. తెలిస్తే వీళ్లు మనను చంపేస్తారు. జాగ్రత్త" అని హెచ్చరించారు.

ట

బారులుతీరిన తాటాకు పాకల మొదటిశ్రేణిలో వెళ్లి నిలుచున్నాం. నిదానించి సీతాపతిగారు ఒకపాక దగ్గరకు నడిచారు. మేము వెంబడించాం. ఆ పాకకు ఒకవైపున 'ఓరుగల్లు ప్రతినిధులు' అని వ్రాయబడిన ఒక అట్ట వ్రేలాడుతున్నది. పాకనిండా ప్రతినిధులు 'కోదండరామునకు..జై' అని కోలాహలం చేస్తున్నారు. సీతాపతిగారు చూపుడువేలు తిప్పుతూ "అదిగో అందులోవారికందరికీ నాయకుడుగా 'అజమాయిషీ' చేస్తున్న ఆడబుల్ పన్నా మనిషి 'అనఘం'గారు. ఈయన బమ్మెరపోతరాజుగారికి సయాన మేనత్తకొడుకు. ఆయనపక్కను పరుపుచుట్ట కానుకుని కూర్చున్నాయన 'అమరం'గారు. యీయనా 'అమలం' 'విమలం' 'ప్రవిమలం' ఒకవేలువిడిచిన పెత్తల్లి పింతల్లిబిడ్డలు. వీరి ఎడంపక్కను కూర్చున్న కుర్రవాడు 'నెజీ.' అతని పక్క వాడు అతని ఆత్మబంధువు 'మజీ'." అనిచెప్పి ఈ మూల కూనిరాగాలు తీస్తున్నాయన ఎవరు చెప్మా అని ఆలోచిస్తుండగా ఓస్ ఈయన 'పరగం' గారండీ అన్నా కొంటెగా. 'రైట్. పదండి ముందు' కన్నారు సీతాపతిగారు.

త

అది కొండవీటి ప్రతినిధులున్న బస.

'నమ స్సాంబశివాయ' అనే కలకలం మాకు దూరానికే వినబడింది. అంతా కుస్తీచేసిన వస్తాదుజబర్దస్తీగా ఉన్నారు. దగ్గరకు వెడితే తంతారేమో అన్న భయంమీద ఓరగా నిలుచున్నాం. సీతాపతిగారు ఎవరికోసమో వెదికివెదికి ఉండబట్టక పాకలోనూరి 'అయ్యా, ధరాదేవిగారు రాలేదేమండీ' అని అడిగారు. పాకంతా గొల్లుమని నవ్వి 'ఈసభాకార్యక్రమం మీ కేమీ తెలియదు కాబోలు. ఈమహాసభకు మాధరాదేవిగారే అధ్య

క్షత వహిస్తారు. వారు త్రోవలో సన్మానసభలూ, స్వాగత పత్రాలూ విధీ విరామం లేకుండా అందుకుంటూ ఈవేళ ౯ గంటలకు రైలుమీద వస్తున్నారు. బ్రహ్మాండమైన ఊరేగింపుతో గోదావరిస్టేషనుకు వెళుతున్నాం' అన్నారు.

'వెళ్లి అంతా గోదారిలో దిగిపొండి. ఆంగ్లకవిత్వంపీడ వదలిపోతుంది.' అన్నారు సన్నగా సూర్యనారాయణశాస్త్రిగారు.

నేను కొంటెగా అందులో ఒకాయనను 'అయ్యా, తమపే రెవరండీ!' అన్నాను. అతడు గూబకు దెబ్బతిన్నట్లు చూసి 'రాజమండ్రీ కుర్రాళ్లకి బొత్తిగా కళ్లు కనిపించడంలేదు. ఏనాడూ మమ్మల్ని చూస్తేగా' అన్నాడు 'గుస్సా' అయిపోయి. 'పేరడుగుతే తప్పండీ?' అని సీతాపతిగారు వద్ది "శాస్త్రీ, తంటా తెచ్చావురా! వాళ్ల నడక్కు - రంగం చెడుతుంది. నేను చెబుతా వినండి. ఇదిగో! మనమీద మండిపడినవా డున్నాడే వాడు 'కెరలి' గాడు. వాడిపక్కవాడు 'పంబిస' వాడు. ఆరుద్రాక్ష తావళం తిప్పుతున్నాయన 'ఒరిమ' గారు. అతని కెదురుగుండా ఆ వెర్రిమొహంవాడు 'అర్థి'. ఈ హడావడిగా పరిగెత్తేవాడు 'పీకం' గారు." అని చెబుతూ ముందుకు నడిచారు.

౫

ఇంకొకపాక. అది 'జమీందారీ' ఫాయా మనుషు లుండదగినంత 'హోదా' గా తయారుచేశారు. ఆ 'రాతిరియుంబవల్ మరపురానిహాయులు' చూస్తే ఒక మహాసామ్రాజ్యం పంచుకు అనుభవిస్తున్నదర్జా గోచరిస్తుంది. పరచిన పట్టుతివాసీమీద ఒక పెద్దమనిషి హుక్కాపీలుస్తూ 'ఫర్రుఖాదుషా' లా ఉన్నాడు. సీతాపతిగారు తేరిచూచి "ఓహో! వీరు విజయనగర ప్రతినిధు లండీ. ఆ హుక్కా పీలుస్తున్నాయన 'హరువుమొల్లం' గారు. మాంచి హుషారైనవాడు. ఇటువెంపు చూస్తున్నాడే అతడు 'అల్లన'. ఇతడు పెద్దన్నగారి దత్తపుత్రుడు. ఆ పొడుగాటివాడు 'వావిరి.' ఇతనికీ వసుచరిత్రభట్రాజుగారికీ మహా దోస్తీ. ఈ పొట్టిముబ్బ కుర్రాడు 'సారిది'. ఆ పొడుంఘట్టిస్తున్నవాడు 'శలకే' ఎలాగో వచ్చి వీళ్లల్లో పడ్డాడు." అన్నారు. అతురక ఎవరం వీరిలో ఉన్నాడు అన్నారు సూర్యనారాయణశాస్త్రిగారు. నేను గుర్తించి ఇతడు పేకోవకవసాయుబు. అరుగో శ్రీ ప్రతినిధులు - ఈ బక్కపలచని జూకాలావిడ 'అంజజయాన' ఆ పచ్చచీరావిడ 'శీతహారిణేక్షణ.' ఆ పడుచు 'శతపత్రేక్షణ.' వారి కెదురుగా కూచుని వెర్రిమొహం వేసి యేమీ తోచక 'క్రతూత్సవసంధాయకుణ్ణి' పిలిచి చుట్ట అంటిస్తూన్నవాడు 'కైతవకుసుమశరాసనుడు.' అనేసరికి వారిద్దరూ పొట్టలుపగిలేట్టు నవ్వుతూ ఈ పై ప్రతినిధులతో శాస్త్రి ఎట్లాగూ తంటా తెస్తాడు. అసలు మనసు చెడుతుంది అని సభాభవనంలోకి లాక్కుపోయారు నన్ను.

౬

ఆహ్వానసంఘసమావేశము జరుగుతున్నది. అధ్యక్షులు 'జగన్నాథం' గారు, కార్యదర్శి 'మానుగ' గారు, తక్కినముగ్గురు సభ్యులు 'పోలగ' 'పెలుచ' 'తద్దయు' గార్లు సభాప్రణాళిక, కార్యక్రమంగూర్చి మాట్లాడుకుంటున్నారు. ప్రణాళిక ఇట్లా సిద్ధమయింది:

(౧) ౮ గంటలకు బ్రహ్మాండమైన ఉత్సవముతో పీ లేశలింగముతో టమీదుగా గోదావరిస్టేషనుకు వెళ్లి ధరాదేవిగారికి ఘనముగు స్వాగత మిచ్చుట.

(౨) యావన్మంది ప్రతినిధులతోను, సభ్యులతోను తిరిగివచ్చి తావన్మందితోను తదుపరి మజ్జనభోజనాదు లాచరించుట

(3) ౨ గంటలకు మహాసభా ప్రారంభము.

(౪) అధ్యక్షుయెన్నికోలు.

(౫) ఆహ్వానసంఘాధ్యక్షోపన్యాసము.

(౬) అధ్యక్షుడ్యుపన్యాసము

(౭) అఖండయతిఆక్రందనము

(౮) క్రొత్తప్రతినిధుల కొన్నిమాటలు.

(౯) అభినందనతీర్మానములు.

(౧౦) సమాప్తి.

'జగన్నాథం' గారు లేచి "సోదరప్రముఖులారా, కార్యప్రణాళిక కడుంగడు చక్కగ కుదిరినది. ఎనిమిది గంటలైనది. లెండు. మన వంశప్రతిష్ఠ కంతకును మూల విగ్రహరూపిణి యగు సద్ధరాదేవి శుభస్వాగతమునకై కదలిరండు." అని గంభీరంగా పలికేసరికి ప్రతినిధులందరూ సభాభవనం నిండిపోయి, 'ధరాదేవికి- మహీరమణికీ—పుడమితల్లికీ—జై' అని తమ భక్త్యుత్సాహముల వెల్లడించి బారులుదీరి బయలుదేరారు.

స్వరయతులందరూ ఒకజట్టు. వ్యంజనవిరామము లందరూ ఒకగుంపు. బిందువిశ్రాంతుల చెట్టాపట్టాలు వెనుక. తరువాత విశేషవిరతుల శ్రేణి. అందరివెనకా అఖండయతిగాడు అప్పకవిని తిట్టుకుంటూ భావకవుల్లో కలిసిపోదామా అని ఆలోచిస్తూ బయలుదేరాడు. ఇనక వేస్తే రాలని యతిపటాలంతో రోడ్డు ఉక్కిరిబిక్కిరి అవుతూ ఒక మహాప్రబంధంలా ఉంది.

ఊరేగింపు వీరేశలింగంతోట దగ్గరకు వచ్చేసరికి చటుక్కున ఇంకాకొందరిని వెంటబెట్టుకుని 'క్రందుగ' గారు ప్రాసప్రముఖులను వెదుక్కుంటూ వచ్చి కలిశారు.

తిన్నగా ఉత్సవం లక్ష్మీవారప్పేటదగ్గరనుంచి 'సర్కారు పశువుల వైద్యశాల' మీదుగా గోదావరి స్టేషనువద్దకు నడిచింది.

మెయిలువచ్చి స్టేషనులో ఆగింది. అమరప్రకారం అక్షరాలా ధరాదేవికుండే పేర్లజాబితా కంఠటికి జైజై కొడుతూ ఆహ్వానసంఘంవారు ఆమెయెక్కిన పెట్టెకోసం జనాన్ని తోసుకుని పరుగెత్తుతూండగా, ఒకపెట్టెలోనుంచి కలంతా నెరిసి ఒకప్పుడు తులలేని వైభవం అనుభవించిన ఒకముసిలావిడ తొంగిచూసింది.

'అదుగో వసుంధరాదేవిగారు' అంటూ జనం అంతా అటువెంపు పరిగెత్తారు. అవయవపటుత్వం తప్పినా సకలాంధ్రకవిత్వరంగమూ అనివారుబయలుగా తిరిగిన ప్రాభవమూ, ఏఆంధ్రకవిఆపత్తులోనైనా ఆదుకొని కాపాడిన ఔదార్యమూ ముఖంలో ప్రతిఫలిస్తూండగా ధరాదేవి జరాభరంతో వణకుతూ దిగింది. ఆమె వెంట 'లీలా' కుమారి, 'లలి' కన్య స్వాగతపత్రాలూ, సంచీ పట్టుకు దిగారు.

'మానుగ', 'జగన్నాథం' గార్లు గబగబ పరిగెత్తుకువచ్చి ధరాదేవిమెడలో కర్పూరపుదండలూ, పూలదండలూ వేసి సాష్టాంగంగా నమస్కరించి లేచారు. వచ్చిన ప్రతినిధులందరూ సాష్టాంగపడదా మనుకున్నారు గాని ప్లాట్ఫారం పట్టదనీ, పాసింజర్లు తొక్కి చంపేస్తారనీ భయపడి జంకి చేతులతోనే 'దండించి' తృప్తిపడ్డారు.

'సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్' లోంచి నవనాగరికులగు ముగ్గురు యువకులు 'పోజు' లిస్తూదిగారు. జనంలో కొత్తప్రతినిధులన్న గోల పుట్టింది. కార్యదర్శి 'మానుగ' గారు తెచ్చికోలునవ్వుతో తేరిచూసి 'అయ్యా, దయ చేయండి! తమరు గుంటూరునుంచా, తెనాలినుంచా బయలుదేరారు' అన్నారు. 'అసలు మొన్న గుంటూరిలో బయలుదేరి తెనాలి నిన్నరాత్రికి వచ్చి ఉదయం బెజవాడలో బయలుదేరాం' అన్నాడు అందులో ఒకాయన.

"తమ నామధేయం ?"

"నాపేరు మధురం - ఈయన వలపుబరువు. ఆయన 'సుమం.' ఏదో మీకుటుంబంలోవాళ్లమే కనక బంధువులనందరినీ చూసిపోదామని వచ్చాం."

"మంచిపనిచేశారు. దయచేయండి"

'మానుగ' వారిని వెంటబెట్టుకుని మహాజనంలోకి వెళ్లాడు. లీలాకుమారి మధురాన్ని చూసి తన చురుకైన కళ్లను ఓరగా అప్పళించి పరిచయసూచకంగా నవ్వింది.

'ప్రేమ గుడ్డిది' అనుకున్నాడు 'వలపుబరువు.' ధరాదేవి కారుఎక్కుటకు నిరాకరించగా రెండెడ్లబండి

మీద ఆమెను ఎక్కించారు. ‘లలి’ కన్య ఆమెతో బండిలోనే కూచుంది. లీలాకుమారి, కొత్తప్రతినిధులూ కారులో ఎక్కగా కారు బర్రుమంది.

౫

మూడుగంటలకు ఎట్టకేలకు మహాసభ ప్రారబ్ధమయింది.

స్త్రీల ప్రత్యేకస్థలంలో స్త్రీప్రతినిధులు కూర్చున్నారు. ‘లీల’ వారందరికీ నాయకురాలులాగ, కొంచెం ముందు కూచుని ‘మధురం’మీద ఓకన్ను పారేసి ఉంచింది. అంతట కార్యదర్శి ‘మానుగ’ లేచి కన్నులుమూసి, ‘శ్రీవాణీగిరిజా శ్చిరాయ’ అని దైవప్రార్థన చేయగా ‘ఎవ్వనిచే జనించు’ కూడా చదివితీరాలి. చదవకపోతే లేచి వెళ్లి మే మింకోసభ పెట్టుకుంటా” మని ఓరుగల్లు ప్రతినిధులు తీవ్ర-గగ్గోల చేశారు. ఓమూలనుంచిరాజమంద్రి పెద్దమనిషి లేచి “అయితే ‘శ్రీమద్భానుసహస్ర’ ఒదిలిపెట్టవలసిందేనా?” అని గద్దించాడు. మధురం కెండాలా లేచి ఫక్తు బంగాళీలో “గీతాంజలిలోవి పదిలైనులు చదివితేగాని నేం ఒప్పుకోం”అన్నాడు. చట్టున ‘జగన్నాతం’గారు లేచి కాంగ్రెసువాదిభీకరారావంతో

“నాయనలారా! అమ్మలక్కనాయనమ్మలారా! బ్రహ్మాండమైన కార్యక్రమము ముందుబెట్టుకొని దైవప్రార్థనకై తగవులాడుట వట్టి ఆంధ్రత్వము. ఆకారతామ్నాయగంగా భగీరథునియందు, ఆ వాగనుశాసనునందు మీకు గౌరవము లేదా! మెండియు నఖండ గౌతమీ జలకణహల్లోహల మదబంధుర మల్లధ్వనుల నుల్లసిల్లు ఉద్దండమండలేశ్వర చండకాండాతికాండ నికురుంబకరంబిత రాజరాజ నరేంద్రచంద్రు పేరోలగమువంటి ఈ పేరోలగమున నింత పూచీలేని పేచీలు లేవనెత్తుట భావ్యమా? సంభావ్యమా” అని గర్జించి అల్లరి సర్ది “ఏదేవి యాధేయభావంబున స్థావరజంగమ ప్రపంచము కాలూని క్రాలుచున్నదో, ఏ దయామయస్వాంత యనుగ్రహంబున నన్నయాదికవులు, వేమనాది యోగులు కృత్యాద్యవస్థ దాటి కృతకృత్యులైరో, ఏయుదారశీల గంటముదించి, ఆకుచించి ఆలోచన తెగక తన్నుగాని చచ్చు ఆంధ్రకవుల కష్టపడి ఆపత్తుదాటించెనో అట్టి శ్రీ వసుంధరాదేవిగారు దయచేసి అధ్యక్షపీఠ మలంకరింతురు గాక.” అని ఉరిమి కూర్చున్నారు.

“ముసలాళ్లు అధ్యక్షపీఠాలు వదులుకుంటేగాని ఈ దేశం బాగుపడ”దన్నాడు మధురం. వెంటనే ముడుచుకుపోతూ అధ్యక్షపీఠానికి కదులుతున్న ధరాదేవి చేయిపట్టుకుని ‘లలి’ కన్య పీఠం ఎక్కించింది. కార్యక్రమం ప్రకారం ఆహ్వానసంఘాధ్యక్షులు తమ ఉపన్యాసం ఇట్లా ప్రారంభించారు:

“అయ్యమ్మలారా! అఖిలాంధ్రయతిప్రాస మహాజనులారా! స్వాగతము. సుస్వాగతము. నేడు ఇప్పుడు ఇక్కడ మనము ఎందుకు సమావిష్టులమైతిమో యందఱకుం దెలిసినయది కాదా? ఒకప్పుడు మనమును తులలేని గౌరవమును, వెలలేని కానుకలను నింపుదలుగా ప్రసంపాదించినవారమె కామా! మనవంశము బహుపురాతనమని యిటీవల దొరికిన కరకాయవలన మరణాశాసనముంబట్టి సువిదితమైనది కాదా? రాజరాజనరేంద్రుని మొదలు రఘునాథరాయులవఱకు మనధాటి కెదురొడ్డినవా రున్నారా?

నన్నయమొదలు చిన్నయదాక మనల గాదని కాలుకదిపినవా రున్నారా? బాలకవి పార్థసారథిశతకము దగ్గరనుండి మహాకవిభారతమువరకు మనము పెట్టినది భిక్ష కాదా! (పొంగివచ్చే కన్నీళ్లు తుడుచుకుని) చచ్చి స్వర్గమునమున్న నన్నయతాతగారు పనియున్నను లేకున్నను నన్ను బిలిచి యభిమానపుత్రునిగా జూచిన దినములు తలచుకొన్న నాకు దుఃఖము వచ్చుచున్నయది. కన్నీరు మున్నీరగుచున్నది. ‘క్రందుగ బాష్పరోధమున కంఠమునున్’ జెడుచున్నది. అయినను గొన్ని సంగతులు మనవిజేసి విరమింతును.

“నేడు కొందరు మనమహాకవు లిచ్చిన ప్రబంధరాజముల జదివి బాగుపడిపోయి, ఎదురుతిరిగి, పొల్లు

పదములు, పడికట్టురాళ్లు అని మన 'భవిష్యము' తీయుచున్నారు. చెల్లరే యిది కొంత విశ్వాసఘాతుకత్వము! అమ్మక చెల్ల వీరి నమ్మగజెల్లదు. వంకాయబజ్జీవలె వట్టి గీతపద్య మిప్పటివారి కారాధ్యమైనది. ఇందు యతి సోదరులకు భిక్ష దొరకినను ప్రాసప్రముఖుల ప్రాణములు పోవుచున్నవి. ఉభయులను గౌరవించు తెలివి వీరికి లేదా? నేటికాలపు డిప్రెషన్ పద్యములకుగూడ ప్రాకినదా! (భీకరంగా) ఆశార్దూలము లేమి! (గర్వంగా)ఆమత్తేభము లేమి! (మృదువుగా) ఆచంపకమాల లేమి?(సువాసనగా) ఆఉత్పలమాలలేమి ? వాని 'షవందు' ఈ తుక్కుగీతములకు, సీచొప్పగేయములకు వచ్చునా ? మెచ్చు దెచ్చునా? ఇన్నీ యివి కొన్నయేఁ? (సభలో : ఆహా ఏం కొట్టేస్తున్నాడయ్యా దెబ్బలు. బలే ! అనేఅభినందనాలు) ఏమయినను పోయినది - పోయినది. ఆంధ్రకవిత్వప్రతిష్ఠ అడుగంటినది. పాపము గోపాలకృష్ణయ్య ఏమన్నాడు? "కొంటిమీరికవిగాళ్ల గతులఘోమయములై నన్ను వీథిని బెట్ట నెన్నుచుండ" అని ఆంధ్రమాతఆవేదనగా వినిపింప లేదా ? లేవరేమి ? నడుములు బిగింపరేమి ? కాళ్లెగుర వేయరేమి ? అల్పులము మన మేమి చేయగలమని యూడకుడు. చెప్పలేదా చిన్నయసూరిమహాకవి 'గడ్డిపెంటి గంధగజమును బంధించు'నని. కావున మన మందరము మన నవమానించిన క్రొత్తకవులను కక్కు-కక్కుమనిపించుట కొక [illegible]గ్రొత్తమార్గము కనిపట్టి ప్రచారము చేయ నీమహాసభ కొన్నాళ్ళము చేసితిని. అది యెట్టిదన :— క్రొత్తకవుల యూహాలు విదేశీయములైన భాష స్వదేశీయ కావలయును. కనుక వారు భాషకొఱకు ప్రబంధములు చదువునప్పుడు మనము మూతిబిగించి బిర్ర బిగిసితిమేని యతడు ఎంత తన్నుకొనినను మన యాంతర్య మును దెలిసికొనలేక చివరకు మనకు దాసోహమయి చెప్పినట్టు వినును. ఈ ఘనకార్యమునకు మీరంద రేక మతులై తోడ్పడినచో కుఱ్ఱకవులను ఘుడియలో లొంగ దీయగలను

"నేను చిరకాల మీయఖరిడగాలమి సకుమర్షణ స్నాన మాచరించి, సారంగధరపర్వతమున ఘనతపం బాచరించి ఈ సహాయనిరాకరణోద్యమమును గనిపట్టి నాను. గాంధీ నాప్రియశిష్యుడు. చెప్పమరచినాను.

"వజ్ఝలపండితాదులు వసుచరిత్ర విమర్శనాదిక ములో మనము వ్యర్థులమని దూషించినను నలుగురి లోను మనము లేకున్న రసభంగ మగునని చెప్పుచుండు టచే వారి నెంతయు మన మభినందింపవలసియున్నది. ఇక మనమనిన నోర్వలేని ముగ్గురను తీవ్రముగ నభిశం సింపవలసియున్నది. సోదరులారా ! చాలతడవైనది. నేను సూచించిన ఉత్కృష్టపద్ధతి ననుసరించి వంశప్రతిష్ఠ నిలు వబెట్టుడు."

అని జగన్నాథంగారు సుఖాసీనులు కాగా ఉవ్వెత్తుగా రేగిన తప్పెటలవంటి చప్పట్లమధ్య ధరాదేవి లేచి "చిరంజీవులారా! ఎందరో మహానుభావు లుండగా నన్ను, ఈముసలిముత్తైదువను అగ్రాసన మెక్కించుట కేవలము తమకున్న శ్రీగౌరవమెయని చెప్పకతప్పదు. ఇంత మహోన్నతపదవికి నేను తగను. శ్రీనాథాదికవిరాజులు నామీద నిష్కారణగౌరవము చూపినట్లే మీరును వ్యర్థ రాలనగు నామీద నింతయాదరము, ప్రాముఖ్యము నుంచి మీస్వాభిమానము ప్రదర్శించినందులకు చాల కృతజ్ఞురాలిగినదానను.

"నాజీవము, జవము నేనాడో తెనుగుకవులకే ధార పోసిన నేను ఈ జరాభరమున నేమియు మాటలాడంజాల ను.అదియునుంగాక శ్రీ జగన్నాథంగారే చెప్పవలసినదంత యుం జెప్పి నాభారము తగ్గించినారు. వారి యమూల్యోప దేశముల ననుసరించి మీరందరు కృతకృత్యులగుదురు గాతమని కోరుచున్నాను" అని చదికిలబడగా చివ్వన అఖండయతి లేచి "క్షాతిశ్చే దనలేన కిమ్మనెడి వాచా రూఢి సత్యంబుగా మీరు నన్ను దరిజేరనీక తరిమికొట్టి నారు. నామీద ఆదరంచూపిన క్రొత్తకవుల వ్యావహారిక భాషతోనే మాట్లాడుతాను.

[illegible]కవులు నన్నభిమానించినా అప్పకవి వాడి సొమ్మంతా పడిపోయినట్టు నన్ను కాదని అడ్డమైన గడ్డి

కరచాడు. నాసోదరుడు రలయతికి విషమే పెట్టాడు. నన్ను ఆదరించిన అభినవకవులను నమ్ముకుని మేమిద్దరం వారితోటే ఉంటాం. మేము మీతో ఎప్పటికీ కలియం. నాకు మీసంస్థతో సంబంధంలేదు." అని దబాయించి చెప్పి కూర్చున్నాడు. యతిప్రముఖులు మండిపడి "పల చారంగనిచ్చితిరి యిత్తురకన్ మన సీమలోనికిన్" అన్నట్టు ఉగ్రులై చూశారు. కొత్తప్రతినిధులలో 'మధురం' లేచి 'జగన్నాతంగారి అభిప్రాయాలతో కొంతవరకూ ఏకీభవిస్తాం. ఆట్టే చెప్పవలసింది లేదు' అని కూర్చున్నాడు. కార్యదర్శి లేచి 'మహానుభావులరగు సన్మిత్రోసదరులారా! తమరందరూ సాదరభావముతో సందండు తోడ్పడి సభ జయప్రదముగా జరిపించినందులకు నిదే వేనవేలు కృతజ్ఞతావందనము లర్పించుచున్నాను. ఈతీర్మానములను తామందరు చిత్తగించి సమ్మతింపగోరుచున్నాను.

౧. ప్రస్తుతము, మనసంఘమును బహిష్కరించి క్రొత్తత్రోవలను ద్రొక్కుచున్న ఇప్పటి కవులు ప్రబంధములం బట్టుకొనినచో వారి కడుగడ్డున నద్దుతగిలి యేడిపించుటకు సీసభవారు తీర్మానించుచున్నారు.

౨. తమ విమర్శనలలో మనము వ్యర్థులమని దూషించి వ్రాసినను,నలుగురిలోను మనవల్ల రస ముప్పతిల్లునని చెప్పు వర్షులపండితాదుల సీసభవారు అభినందించుచున్నారు.

3. మనలను పీఠికలలోను,పత్రికలలోను దూషించి యిహపరములకు చెడిన ఛందోదర్పణపీఠికాకారుడు సీతాపతి, యతిప్రాస లైచ్ఛికములని యుగాదిసంచికలో వ్రాసిన సూర్యనారాయణశాస్త్రి, పద్యములలో యతిప్రాసల త్రోసి మనపై కత్తికట్టిన హనుమచ్ఛాస్త్రి గార్లను సభవారు మిక్కిలి గర్హించుచున్నారు.

సభ్యులంతా 'భేష్—బలే—అవును' అని చప్పట్లు కొట్టి, అట్టహాసాలు చేసి తమ ఆమోదమును తెలియజేస్తూ సభలోంచి లేచారు. మే మెవరమో తెలియకుండా బయటపడేటప్పటికి బ్రహ్మాండ మయిపోయింది.